

సప్లిమెంటరీకి సర్వం సిద్ధం

టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీకి సర్వం సిద్ధమైంది. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. - 8లో



పుష్పయాగం.. నేత్రపర్వం

శ్రీకాకుళం నారాయణ తిరుమలలో స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరుగుతోంది. పుష్పయాగం నిర్వహించారు. - 8లో

వాహన్ నిక్‌లోనే రవాణా సేవలు

శ్రీకాకుళం రూరల్: రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సాంకేతిక లోపం కారణంగా ఈనెల 22 నుంచి ఈ ప్రగతిలో రవాణాశాఖ సేవలు నిలిపి వేసినట్లు ఉపరవాణా శాఖాధికారి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వాహన్ నిక్ ద్వారా ఫిట్‌నెస్ పరీక్షలు, వాహన పర్మిట్లు ఇతర కార్యకలాపాలన్నీ కొనసాగుతున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని వాహన యజమానులు గుర్తించాలన్నారు. ఏమైనా సమస్యలు ఏర్పడితే నేరుగా జిల్లా రవాణాశాఖ కార్యాలయాన్ని సందర్శించాలని వారు కోరారు.

న్యూస్‌రీల్

ఈ నెల 25న రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 25న అండర్–18 విభాగంలో రగ్బీ జిల్లా జట్లు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.రామకృష్ణ, పి.పార్వతీశం, ఆర్గనైజర్ బి.నారాయణరావు తదితరులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బాల బాలికలకు వేర్వేరుగా నిర్వహిస్తున్న ఈ ఎంపికల్లో భాగంగా 2006 నుంచి 2008 సంవత్సరం లోపు జన్మించిన వారు ఆధార్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. ఇందులో ఎంపికైన జట్లు ఈ నెల 30 నుంచి రెండు రోజుల పాటు విశాఖలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 8500007272 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

గోకర్ణపల్లి ఎన్నికల వివాదంలో 28 మంది అరెస్టు

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లి గ్రామంలో ఈ నెల 13న ఎన్నికల సమయంలో జరిగిన కొట్లాటకు సంబంధించి 28 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్‌ఐ వై.రవికుమార్ తెలిపారు. గోకర్ణపల్లిలో జరిగిన కొట్లాటలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు బుధ, గురువారాల్లో 28 మందిని అరెస్టు చేసి శ్రీకాకుళం కోర్టుకు తరలించారు. రిమాండ్ విధించడంతో వారిని అంపోలు జైలుకు తరలించినట్లు తెలిపారు.

'హెవీ డ్రైవింగ్ శిక్షణ వినియోగించుకోండి'



శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసిన డీపీటీఓ విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు ఆ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళంలో శిక్షణ పూర్తి చేసుకున్న 15వ బ్యాచ్ డ్రైవర్లకు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ చేతుల మీదుగా గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ భవిష్యత్‌లో మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ వారంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కోసం 16వ బ్యాచ్ మొదలవుతుందని, ఇందు కోసం లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్, ఒక సంవత్సరం అనుభవం కలిగిన వారందరూ కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ శిక్షణ 40 రోజులు ఉంటుందని, శిక్షణతోపాటు మెకానికల్ వర్క్, యోగా, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్, రోడ్డు ట్రాఫిక్ రూల్స్ మొదలగు అన్నింటి మీద కూడా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు కూడా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తదుపరి బ్యాచ్, ఫీజు ఇతర వివరాలు కోసం 9963091999 నంబరును సంప్రదించాలని విజయ్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షకుడు వర్మ తదితరులు ఉన్నారు.

అర్ధరాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



శివానీలో భద్రత పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న వేళ ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు బుధవారం అర్ధరాత్రి దాటాక ఎస్పీ రాధిక వెళ్లి ఆకస్మిక తనిఖీలు జరిపారు. జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో గార్డు పహారా సరళిని తనిఖీ చేసి సిబ్బందిని అప్రమత్తం చేశారు. నియమించిన సిబ్బంది వివరాలు, గార్డు సర్వే తదితర అంశాలపై ఆరా తీసి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి పీఎన్ కాలనీ రెండో లైన్‌లో నైట్ బీట్ సిబ్బందిని తనిఖీ చేసి పకడ్బందీగా గస్తీ విధులు నిర్వర్తించి నేర నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు.

అర్ధరాత్రి స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను ఎస్పీ జీఆర్ రాధిక బుధవారం అర్ధరాత్రి పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరు, కేటాయించిన భద్రత పాయింట్లు వంటివి పరిశీలించారు. రౌండ్ ది క్లాక్ భద్రత ఉంచినట్లు చెప్పారు.



చెత్త, నాచు, ఇతర వ్యర్థాలతో నిండిపోయిన నాగావళి నది పరీవాహక ప్రాంతం

ఈ నగరానికి ఏమైనది?



నగరానికి పురాతన బంధువులా ప్రవహిస్తున్న నాగావళి రానురాను మన చేష్టల వల్ల పవిత్రత కోల్పోతోంది. ఈ తల్లి పొత్తిళ్లలో పురుడు పోసుకున్న నగరమే నదిని నాశనం చేస్తోంది. స్వచ్ఛమైన నీటితో పరివాహక ప్రాంతాలను ఎన్నో శతాబ్దాలుగా సస్యశ్యామలం చేసిన ఈ లాంగుళ్య మాత శ్రీకాకుళం చుట్టుపక్కల ప్రాంతాల్లో మాత్రం కలుషితమైపోతోంది. సాక్షాత్తు గంగలా భావించి ఉమారుద్ర కోటేశ్వరుడు నిత్యం అభిషేకం చేయించుకునే ఈ నీటిని నగరం కాలుష్య కాసారంలా మార్చేస్తోంది. ప్రతి ఇంటి నుంచి వచ్చే చెత్తనంతా నదిలోకి పంపించేస్తుండడంతో నది రూపు కోల్పోతోంది. కళ్ల ముందే తల్లి ఇలా సౌందర్యం కోల్పోతుండడం పర్యావరణ ప్రేమికులనే కాదు.. సగటు నగర వాసి గుండెలను పిండేస్తోంది.

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



ఈ పరిస్థితిని మార్చాలంటే...

MAY 26

నాగావళికి జీవన్‌దానం



కె.జీవన్

నాగావళి దుస్థితి ఓ యువకుడిని కదిలించింది. నదిలో పేరుకుపోయిన చెత్త ఓ విద్యార్థి మనసును కలిచివేసింది. నగరమంతా రోజూ నదిలో చెత్తను వేస్తూనే ఉంది.. చూస్తూనే ఉంది. కానీ ఈ యువకుడు మాత్రం ఓ అడుగు ముందుకు వేశాడు. మనమే ఎందుకు నదిని బాగు చేయకూడదని తనకు తాను ప్రశ్నించుకున్నాడు. తనతో పాటు సమాజాన్నీ ఈ బృహత్కార్యంలో భాగస్వాములు చేయడానికి నిర్ణయించుకున్నాడు. అతనే శ్రీకాకుళం నగరానికి చెందిన కె.జీవన్. ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో చదువుతున్నాడు. అతను ఆర్టీసీ కాంప్లెక్సు వెనుక నివాసం ఉంటూ, గుజరాతీపేటలో ఉంటున్న తన అమ్మమ్మ ఇంటికి వెళ్తూ రోజూ నదిని చూసేవాడు. నదిలో పేరుకు పోతున్న చెత్తను చూసి ఈ ఆలోచన చేశాడు. ఆలోచన వచ్చిన వెంటనే ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. దానికి మంచి స్పందన వచ్చింది. తర్వాత ట్విట్టర్‌లో కూడా పోస్టు చేశాడు. సుమారు 100మందికి పైగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు ముందుకు వస్తున్నారు. వారందరూ ఈనెల 25కు శ్రీకాకుళం చేరుకుంటారు. 26న ఆదివారం ఉదయం 7గంటల నుంచి రెండు గంటల పాటు క్లీనింగ్ నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా 'జీవన్' సాక్షితో మాట్లాడుతూ ఇప్పుడు చెత్తను క్లీన్ చేయడమే కాకుండా మళ్లీ చెత్త వేయకుండా ప్రజలను అవగాహన పరచాలని చూస్తున్నానని అన్నాడు. తాను ఇచ్చిన పిలుపునకు ఎంతో మంది స్పందించారని, ఇతర రాష్ట్రాల నుంచి కూడా యువకులు, ఉద్యోగులు వస్తున్నట్లు మెసేజ్‌లు పంపించారని తెలిపాడు. వీరందరితో కలిసి ఓ వాట్సాప్ గ్రూప్ కూడా పెట్టామని చెప్పాడు. – శ్రీకాకుళం కల్చరల్

మీరూ భాగస్వాములు కావాలనుకుంటున్నారా..

26 ఆదివారం ఉదయం 7గంటల నుంచి రెండు గంటల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. నదీ పరిరక్షణ యజ్ఞంలో మీరు భాగస్వాములు కావాలంటే 79811 07423 ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి తమ సహకారం అందివ్వాలని జీవన్ విజ్ఞప్తి చేస్తున్నాడు.

పదండి.. నాగావళిని పరిరక్షించుకుందాం..

ముగిసిన ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2024 (ఏపీ ఈఏపీ సెట్) గురువారం ముగిసింది. ఈ నెల 16వ తేదీ నుంచి గురువారం వరకు పరీక్షలు జరిగాయి. 16, 17 తేదీల్లో బైపీసీ స్ట్రీం పరీక్షలు జరగ్గా, 18వ తేదీ నుంచి 23 వరకు ఎంపీసీ స్ట్రీం పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో నరసన్నపేట కోర్ టెక్నాలజీస్, టెక్కలి ఐతం కళాశాల, చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాల, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించగా 13,323 మందికి 12,635 మంది హాజరయ్యారు. చివరి రోజు గురువారం కోర్ టెక్నాలజీస్‌లో 328 కి 309, ఐతంలో 300 కి 289, శివానీలో 229 కి 213, వెంకటేశ్వరలో 180కి 170 మంది హాజరయ్యారు. చివరి రోజు 1037కి 981 మంది హాజరయ్యారు. 56 మంది గైర్హాజరయ్యారు.

కాలేజీలు రెడీ

- 27 నుంచి పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్
- శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రం
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కౌన్సెలింగ్
- జిల్లాలో ఐదు ప్రభుత్వ, ఐదు ప్రైవేట్ కళాశాలల్లో 2591 సీట్లు
- ప్రభుత్వ కళాశాలల్లో 780 సీట్లు, ప్రైవేట్ కళాశాలల్లో 1811 సీట్లు



శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నికల్ కోర్సుల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ కోర్సు పూర్తి చేశాక చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండడంతో చాలా మంది దీనివైపు మొగ్గు చూపుతున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంస్థ పాలీసెట్–2024 ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 27 నుంచి జూన్ 3 వరకు కౌన్సెలింగ్‌లో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. షెడ్యూల్ మేరకు విద్యార్థులు ర్యాంకు బట్టి కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. శుక్రవారం నుంచి జూన్ రెండు లోపు ఆన్‌లైన్ పద్ధతిలో ప్రాసెస్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఓసీ, బీసీలు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ. 250 చెల్లించాలి. ఫీజు చెల్లించిన రశీదు, పాలీసెట్ హాల్ టిక్కెట్, ర్యాంకు కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, నాల్గో తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ, టీసీ, స్టడీ లేని వారు ఏడేళ్ల రెసిడెన్స్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ వర్తించే వారు అర్హత ధ్రువీకరణ పత్రం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నాన్ లోకల్ విద్యార్థులు మైగ్రేషన్ సర్టిఫికెట్, పీడబ్ల్యూడీ, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, స్కౌట్, మైనారిటీ, ఆంగ్లో ఇండియన్ వంటి ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్న వారు అర్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుంది.

షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్



పాలీసెట్ ర్యాంకు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి షెడ్యూల్ మేరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలి. ర్యాంకు రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. జిల్లాలో అందుబాటులో కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులు కళాశాలల్లో చేరేముందు గత కొంత కాలంగా ప్రవేశాలు, అధీకృత సంస్థల గుర్తింపులు, గత కొన్నేళ్లగా లభిస్తున్న ప్లేస్‌మెంట్‌లు, పూర్వపు విద్యార్థులు ఫీడ్ వంటివి తెలుసుకోవాలి.

– జి.దామోదర్‌రావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్, సహాయ కేంద్రం కోఆర్డినేటర్.

ధ్రువీకరణ పత్రాలు పరిశీలన షెడ్యూల్

తేదీ	ర్యాంకు
27	1-12000
28	12001-27000
29	27001-43000
30	43001-59000
31	59001-75000
జూన్ 1	75001-92000
2	92001-108000
3	108001-చివరి ర్యాంకు

ఆప్షన్లకు షెడ్యూల్...

తేదీ	ర్యాంకు
31 నుంచి జూన్ 1	1-50000
2-3	50001-90000
4-5	90001-చివరి ర్యాంకు

- జూన్ 5న ఆప్షన్ల మార్పునకు అవకాశం.
- జూన్7న సీట్లు అలాట్‌మెంట్.
- ప్రత్యేక కేటగిరీలు ఎన్‌సీసీ, ఆంగ్లో ఇండియన్, స్పోర్ట్స్, పీడబ్ల్యూడీ, క్యాప్, స్కౌట్ వంటి వారికి ఈ నెల 31 నుంచి జూన్ 3 వరకు విజయవాడలోని బెంజ్ సర్కిల్‌లో సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు.

జిల్లాలో ఐదు ప్రభుత్వ, ఐదు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలు ఉన్నాయి. ఐదు ప్రభుత్వ కళాశాలల్లో 780 సీట్లు, ఐదు ప్రైవేట్ కళాశాలల్లో 1811 సీట్లు మొత్తం 10 కళాశాలల్లో 2591 సీట్లు ఉన్నాయి.

ప్రభుత్వ కళాశాలలు

కళాశాల	సీట్లు
శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్	300
శ్రీకాకుళం మహిళా పాలిటెక్నిక్	120
టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్	120
ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్	120
సీతంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్	120

ప్రైవేట్ పాలిటెక్నిక్‌లు...

కళాశాల	సీట్లు
ఎచ్చెర్ల, వెంకటేశ్వర	462
టెక్కలి, ఐతం	396
గూడేం, నారాయణ	383
మందస, టీపీఆర్	297
చిలకపాలెం, శివానీ	263

- ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) కింద పది శాతం అదనంగా సీట్లు పెంచి ప్రతి బ్రాంచ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.

'దివ్యాంగ పిల్లల గుర్తింపునకు సహకరించండి'

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అంగన్‌వాడీకి, బడికి దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సహకరించాలని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ జిల్లా అదనపు కోఆర్డినేటర్ (ఏపీసీ) డాక్టర్ రోణంకి జయప్రకాష్ కోరారు. జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక అవసరాలగల పిల్లల గుర్తింపు సర్వేలో భాగంగా గురువారం నగరంలోని మడ్డివీధి అంగన్‌వాడీ పరిధిలో ఉన్న రుత్విక్, నిరుపమ అనే ఇద్దరు మేథోపరమైన వైకల్యం కలిగిన విభిన్న ప్రతిభావంతులను గుర్తించారు. స్వయంగా ఈ సర్వేలో ఏపీసీ జయప్రకాష్ భాగస్వాములై బాలల స్థితిగతులను, వారి జీవిత విధానాన్ని తల్లిదండ్రులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సరైన అవగాహన, చైతన్యం లేక నాలుగు గోడలకే పరిమితమైపోతున్న విభిన్న ప్రతిభావంతులను బడికి చేరువ చేసే ఈ యజ్ఞంలో అన్ని వర్గాలు ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు.

బడులకు చేరువ చేస్తే ఎన్నో రాయితీలు..

దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పిస్తే అనేక సదుపాయాలు, వసతులు, రాయితీలతోపాటు రవాణా చార్జీలను అందిస్తామని ఏపీసీ డాక్టర్ జయప్రకాష్ తెలిపారు. ఇందుకు అందరూ సహకరించి దివ్యాంగ బాలలను బడులకు చేరువ చేయాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో ప్రత్యేక అవసరాల విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు చేసే ప్రక్రియ శరవేగంగా సాగుతున్నట్టు చెప్పారు. ఈ సర్వేలో తమ పేర్లు నమోదు కాని వారు సమగ్రశిక్ష సహిత విద్య సమన్వయకర్త (బి.గోవిందరావు)సెల్: 9492420186 నంబర్‌ను సంప్రదించాలని, ఆ వెంటనే తమ సిబ్బంది వచ్చి వివరాలు సేకరిస్తారని జయప్రకాష్ పేర్కొన్నారు.

పక్కాగా లెక్కింపు

- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్



జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికలు–2024 ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల కమిషన్ సూచించిన నియమ నిబంధనలపై రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, లెక్కింపు పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలలో ఓట్ల లెక్కింపుపై ఒక్కరోజు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఓట్ల లెక్కింపులో ఆర్వో, ఏఆర్ఓలు, సూపర్ వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు సమన్వయంతో పనిచేసి ప్రక్రియ ప్రశాంతంగా జరిగే లా చూడాలన్నారు. విధులకు హాజరయ్యే సిబ్బంది లెక్కింపుకు సంబంధించిన హ్యాండ్ బుక్ క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్‌లో డిక్లరేషన్‌పై సంతకం ఉన్నదీ లేనిదీ జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.

ఆర్వో, అబ్జర్వర్ల పాత్ర కీలకం

ఓట్ల లెక్కింపులో రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని, ఆయా నియోజకవర్గ సంబంధిత రిటర్నింగ్ అధికారిదే పూర్తి బాధ్యత అని, తప్పక దాన్ని ఎంతో పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రశాంత కౌంటింగ్ లక్ష్యంగా పనితీరు ఉండాలని, కౌంటింగ్ డేటా క్రోడీకరణ, ఎన్కోర్ యాప్ నందు అప్‌లోడ్ సక్రమంగా సకాలంలో చేయాలని అన్నారు. అనంతరం శిక్షణకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్ఓ ఎం.గణపతి రావు, ఆర్వోలు నూరుల్ కమర్, భరత్ నాయక్, సీహెచ్ రంగయ్య, లక్ష్మణ మూర్తి, రామ్మోహన్, సుదర్శన్ దొర, అప్పారావు, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డుమా పీడీ చిట్టి రాజు, ట్రైనర్లు కిరణ్, ఎస్.బాలాజీ, మెప్మా పీడి కిరణ్ కుమార్, శేష గిరి, అన్ని మండలాల తహసీల్దార్లు, 116 మంది వివిధ స్థాయిల సిబ్బంది శిక్షణకు హాజరయ్యారు.

క్లుప్తంగా

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కార్డన్ సెర్చ్



హిరమండలంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

హిరమండలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నారు. గురువారం మేజర్ పంచాయతీ హిరమండలం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో స్థానిక ఎస్‌ఐ జి.నారాయణ స్వామి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృతంగా సోదాలు నిర్వహించారు. వివాదాస్పద వ్యక్తులు, అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అలాగే పశువుల శాలలు, గడ్డివాములు క్షుణ్ణంగా పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సమీపిస్తున్న తరుణంలో శాంతిభద్రతలకు విఘాతం లేకుండా చూడాలని ఎస్పీ ఆదేశించించడంతో ఈ పరిశీలనలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఐజేనాయుడు కాలనీలో కార్డన్ సెర్చ్

ఆమదాలవలస రూరల్: మున్సిపాలిటీ పరిధిలో గల ఐజేనాయుడు కాలనీలో ఎస్‌ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్, ఫ్లాగ్‌మార్చ్ గురువారం నిర్వహించారు. కాలనీలో ఇంటింటా ఉన్న ద్విచక్ర వాహనాల రికార్డులను తనిఖీలు నిర్వహించి, ఎలాంటి పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. వాహనదారులు తగిన పత్రాలు కలిగి ఉండాలని లేకుంటే సీజ్ చేస్తామని తెలిపారు.

ఎంపికైన విద్యార్థుల జాబితా వెబ్‌సైట్‌లో

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం హయాతీనగరం ఉన్న మహాత్మజ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశపరీక్షలో ఎంపికైన విద్యార్థినుల జాబితా అధికారిక వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉన్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గొలివి స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థినుల పేర్లు ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎఫ్.ఇన్ వెబ్‌పోర్టల్‌లో ఉంచినట్లు వెల్లడించారు. ప్రవేశాల సమయంలో తమ వెంట రికార్డు షీటు, ర్యాంకు కార్డు, కుల, ఆదాయ పత్రాలు, ఆధార్‌కార్డులు తీసుకురావాలని సూచించారు.

సప్లిమెంటరీకి సర్వం సిద్ధం

- నేటి నుంచి టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- 9 కేంద్రాల్లో పది, 51 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలకు చర్యలు
- ప్రభుత్వ ఆదేశాల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు



టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు శ్రీకాకుళంలో సిద్ధంచేసిన ఫర్నీచర్

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో శుక్రవారం నుంచి మొదలుకానున్న ఈ పది, ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్ష కేంద్రాలకు మెటీరియల్స్‌ను చేరవేశారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఇలా..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఫెయిలైన విద్యార్థులతోపాటు ప్రథమ సంవత్సరంలో మార్కులు పెంచుకునేందుకు (ఇంప్రూవ్‌మెంట్/బెటర్‌మెంట్) మరికొంతమంది పరీక్షలను రాస్తున్నారు. మొత్తం మీద ఈ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల నుంచి 23,668 మంది విద్యార్థులు ఫీజులను చెల్లించారు. వీరి కోసం 51 కేంద్రాలను కేటాయించారు. వీటిలో ప్రభుత్వ యాజమాన్య కళాశాలలే అధికంగా ఉన్నాయి. పరీక్ష కేంద్రాల్లో ఫర్నీచర్‌ను సిద్ధం చేశారు. సీసీ కెమెరాలను ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేసి అమర్చారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించి వారికి డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్‌ఐఓ ప్రగడ దుర్గారావు, డీఈసీ కమిటీ సభ్యులు బి.శ్యామ్‌సుందర్, జి.సింహాచలం, కె.తవిటినాయుడు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రాలపై నిఘా పెట్టేందుకు హైపవర్ కమిటీ, జిల్లా పరిశీలకులతోపాటు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, మరో రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు.

రెండు సెషన్స్‌లలో పరీక్షలు..

సప్లిమెంటరీ పరీక్షలను రెండు సెషన్లుగా నిర్వహిస్తున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి. విద్యార్థులు అర్ధగంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, నిర్ణీత సమయానికి హాజరుకాకుంటే.. పరీక్ష కేంద్రం లోపలకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 144 సెక్షన్ పక్కాగా అమలయ్యేందుకు, పరీక్ష కేంద్రాల వద్ద పహారా కాసేందుకు పోలీసు సిబ్బందిని నియమించారు. ఎలక్ట్రానిక్ పరికరాలను పూర్తిగా నిషేధించారు. ఇన్విజిలేటర్లను నియమించారు. గ్రామీణ ప్రాంతాల్లోని 10 ప్రత్యేక రూట్లలో ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. ఎండల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని కేంద్రాలలో తాగునీరు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్లతో మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు.



సీసీ కెమెరాల ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌ను పరిశీలిస్తున్న డీవీఈవో కోట ప్రకాశరావు

పదో తరగతి పరీక్షలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల్లో జరగనున్న టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 2090 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జరుగుతాయి.

విద్యార్థులు నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 8.45 నుంచి పరీక్ష కేంద్రం లోపలకు అనుమతిస్తామని తెలిపారు. 9.30 తర్వాత లోపలకు అనుమతించబోమని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు కానుంది. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటించారు.

మౌలిక సదుపాయాలపై ఫోకస్..

ఎండల నేపథ్యంలో కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాలపై నిఘా పెట్టేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. 9 కేంద్రాలకు సీఎస్‌లు, డీఓలను నియమించారు. తనిఖీల కోసం విద్యాశాఖ, రెవెన్యూశాఖ, పోలీసుశాఖల పర్యవేక్షణలో 2 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

విజయవంతం చేయాలి..

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సిబ్బందిని నియమించాం. ప్రత్యేకంగా ఏర్పాట్లపై పలుమార్లు సమీక్షించాం. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలి.

– కె.వెంకటేశ్వరరావు, డీఈవో శ్రీకాకుళం

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం..



ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యార్థుల హాల్‌టిక్కెట్లు జ్ఞానభూమి వెబ్‌పోర్టల్ బీఐఈఏపీ సర్వీసెస్‌లో అందుబాటులో ఉన్నాయి. డీఈసీ కమిటీ నేతృత్వంలో అధికారులు, సిబ్బందిని ఇప్పటికే నియమించాం. వారికి అనేక అంశాలపై దిశానిర్దేశం చేశాం. అధిక ఎండలు, ఉక్కపోతల నేపథ్యంలో ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలలో మౌలిక సదుపాయాలను పక్కాగా కల్పించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– ప్రగడ దుర్గారావు, జిల్లా ఆర్‌ఐఓ శ్రీకాకుళం

క్యాంపస్ డ్రైవ్‌లో ఏడుగురు ఎంపిక

- ఏడాదికి రూ.21 లక్షలు ప్యాకేజీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం మణప్పురం ఫైనాన్షియల్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. 37 మంది హాజరు కాగా, రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ద్వారా ఏడుగురిని ఎంపిక చేశారు. వర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి కె.విద్యాసాగర్ క్యాంపస్ డ్రైవ్ పర్యవేక్షించారు. కంపెనీ ప్రతినిధుల బృందం ఎంపిక ప్రక్రియ నిర్వహించింది. ఎంపికైన వారికి ఏడాదికి రూ. 21 లక్షలు ప్యాకేజీ అందజేయనున్నట్లు ప్లేస్‌మెంట్ అధికారి తెలిపారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి



మల్లేశ్వరరావు

హిరమండలం: స్థానిక చిన్నకోరాడ వీధి చివరన మద్యం మత్తులో డ్రైనేజీలో పడి వ్యక్తి ఓ మృతి చెందాడు. ఎస్‌ఐ జి.నారాయణ స్వామి తెలిపిన వివరాల మేరకు.. మేజర్ పంచాయతీ హిరమండలం మేదరవీధికి చెందిన తెల్లి మల్లేశ్వరరావు(44) ఓ హోటల్ లో పనిచేస్తుండేవాడు. బుధవారం చిన్నకోరాడ వీధి శివారులో ఉన్న డ్రైనేజీ ఖానాపై కూర్చుని మద్యం మత్తులో వెనక్కి తూలడంతో కాలువలో పడిపోయాడు. ముఖం నీటిలో మునిగిపోవడం, ఆ మత్తులో పైకి లేవలేకపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు ఎస్‌ఐ గురువారం తెలిపారు. మృతుడికి భార్య రాజేశ్వరి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీళ్లంతా ప్రస్తుతం అయోధ్య రామాలయం యాత్రలో ఉన్నారు. మృతుని సోదరుడు టి.రమణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

గారపేటలో వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి



కిత్తయ్య

పొందూరు: మండలంలోని గారపేట(క్రిష్టాపురం) గ్రామంలో వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి చెందారు. గ్రామానికి చెందిన చెందిన గార కిత్తయ్య ఉపాధి పనిచేస్తుండగా వడదెబ్బ తగలడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తోటి కార్మికుల సాయంతో కిత్తయ్యను ఇంటికి తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు ప్రాథమిక చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన కిత్తయ్య మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'పటిష్ట భద్రతతో ఓట్ల లెక్కింపు'



శ్రీకాకుళం పాతబస్టాండ్: పటిష్టమైన భద్రతతో ఓట్ల లెక్కింపు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం ఆయన జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత, సీసీ టీవీల ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలన్నారు. శిక్షణ పూర్తి చేయాలని చెప్పారు. జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు వివరాలను, పోస్టల్ బ్యాలెట్, తదితర వివరాలను వివరించారు. మూడంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశామని, పటిష్టమైన బార్ కోడింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ జరుగుతుందని వివరించారు. వీసీలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, పలాస, శ్రీకాకుళం, పాతపట్నం, ఇచ్ఛాపురం, నరసన్నపేట నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు డాక్టర్ భరత్ నాయక్, సి.హెచ్. రంగయ్య, అప్పారావు, సుదర్శన్ దొర, రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

వజ్ర కవచధర గోవిందా..



స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారిని వైశాఖ పౌర్ణమి సందర్భంగా వజ్రకవచధారణతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

– నరసన్నపేట

గరుడ సేవలో..



స్థానిక వేంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం స్వామికి గరుడ వాహన సేవ నిర్వహించారు. ఈ సేవ ను ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రతినిధి రాదా మనోహరదాస్ ప్రారంభించారు. గరుడ వాహనంపై స్వామిని ఊరేగించారు.

– నరసన్నపేట

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



మండలంలోని కుంచాల కుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో గురువారం పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి పలు అభిషేకాలను నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలను నిర్వహించారు. కుంకుమార్చనలు మహామేరువు, శ్రీచక్రాల వద్ద నిర్వహించారు. – ఎచ్చెర్ల

వంతెన పనులతో పలు రైళ్లు రద్దు

కాశీబుగ్గ: జిల్లా మీదుగా నడిచే రైళ్లలో కొన్నింటిని రద్దు చేయగా మరి కొన్నింటిని కుదించామని ఇంకొన్నింటి రాకపోకల సమయంలో మార్పులు చేశామని వాల్తేరు రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. పూండి–నౌపడ–కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌ల సెక్షన్, నౌపడా యార్డు, పర్లాఖిమిడి పరిసరాల్లో పనులు జరుగుతుండటంతో ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేశామని అన్నారు. రైలు నంబర్ 08522 విశాఖపట్నం–గుణుపూర్ పాసింజర్, 08521 గుణుపూర్–విశాఖపట్నం పాసింజర్, 07471 పలాస–విశాఖపట్నం, 07470 విశాఖపట్నం–పలాస పాసింజర్ రైలు రద్దు చేశామని అన్నారు. రైలు నంబర్ 18417 పూరి–గుణుపూర్ రాజ్యారాణి ఎక్స్‌ప్రెస్ రౌర్కెలాలో 23వ తేదీ నుంచి 26వ తేది వరకు పలాస నుంచి పూరికి నడుస్తుందని పలాస నుంచి రౌర్కెలాకు 18118 రాజారాణి ఎక్స్‌ప్రెస్ అదే తేదీల్లో నడుస్తుందని గుణుపూర్ వెళ్లదని పలాస వరకే ఈ రెండు రైళ్లు నడుస్తాయని తెలిపారు.

అదేవిధంగా 18417/184118 పూరి–గుణుపూర్, గుణుపూర్–పూరి రాకపోకలు చేసే రైళ్లు 27, 28వ తేదీల్లో పలాస వరకు కుదించారని తెలిపారు. ఈ నెల 27,26వ తేదీలలో 18526 విశాఖపట్నం–బ్రహ్మపురం ఎక్స్‌ప్రెస్, 07225 సికింద్రాబాద్–షాలీమార్ సమ్మర్ స్పెషల్ రైలు, 07234 సికింద్రాబాద్–సంత్రాగచ్చి సమ్మర్ స్పెషల్ రైళ్లు రాకపోకల్లో మార్పులు చేశారని, ప్రయాణికులు గమనించాలని కోరారు.

సముద్రం వెనక్కి..



అక్కుపల్లి శివసాగర్ తీరంలో వెనక్కి వెళ్లిన సముద్రం

వజ్రపుకొత్తూరు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలో గల అక్కుపల్లి శివసాగర్ తీరంలో గురువారం మార్పు చోటు చేసుకుంది. ఉదయం సముద్ర కెరటాలు ఉద్రిక్తంగా ఎగసిపడుతూ తీరం వైపు దూసుకువచ్చాయి. అలా కొద్ది సేపటి వరకు తీరం వైపు దూచుకువచ్చిన సముద్రం ఒక్క సారిగా సుమారు 100 మీటర్లు వెనక్కి వెళ్లడంతో పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరికలు చేసింది. పర్యాటకులు సైతం సముద్ర స్నానం చేసేందుకు వెనుకంజ వేశారు.

పుష్పయాగం.. నేత్రపర్వం



పుష్ప కవచ దర్శనంలో వేంకటేశ్వరస్వామి



పట్టణంలోని నారాయణ తిరుమలకొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి అవభృద స్నానం, పుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సమూర్తులకు అవభృద స్నానాలు చేయించారు. సాయంత్రం పుష్పయాగ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ముందుగా బంతి, చామంతి, మల్లె, జాజి, విరజాజి, వాదంబరం, గులాబి, లిల్లీ, వంటి పలు రకాల పూలను భక్తులు తలపై ఉంచుకొని ఆలయ బేదా మండపం చుట్టూ ప్రదక్షిణ చేసి కల్యాణ వేదిక వద్దకు చేర్చారు. అనంతరం స్వామికి పుష్పాలతో పూజలు చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్



పుష్పాలతో ముగ్గులు



స్వామి కోసం ఏర్పాటు చేసిన పుష్పాలు